# ఆస్మాన్‌సే...

గోపాలం నౌబత్ పహాడ్ పైన నుంచుని చుట్టూ చూశాడు. రంగు రంగుల నియాన్ లైట్లతోనూ, రోడ్ల ప్రక్కన వరుసగా వున్న మెర్క్యూరీ దీపాలతోనూ, కదిలే కార్ల లైట్ల వింత వెలుగులతోనూ, మెరిసిపోతున్నది భాగ్యనగరం.

భాగ్యనగరమని హైద్రాబాద్‌కు పేరు రావటానికి కారణం అక్కడ అందరూ భాగ్యవంతులేనా? దరిద్రులు అసలు లేరా? - అదోరకమైన వింత ఆలోచన వచ్చింది గోపాలానికి.

చుట్టూరా చూశాడు. ఆకు పచ్చటి నియాన్ లైట్ల అందమైన కాంతి ముందు వెల వెలా పోతున్న మామూలు దీపాలు కనపడ్డాయి. అతని ఆలోచనకి ఏదో జవాబు స్ఫురించినట్లయింది.

అందంగా కత్తిరించబడ్డ లాన్ మీద పడుకున్నాడు. చేయి తల క్రింద వుంచుకుని అలా ఆకాశం వేపు చూశాడు.

తనలోనే వెన్నెల అంతా నింపుకుని మిడిసిపడుతున్న చంద్రుడి ముందు వెలవెలా పోతున్న నక్షత్రాలు ఎన్నో కనపడ్డాయి--

గోపాలానికి నవ్వు వచ్చింది.

నవ్వేశాడు కూడాను.

ఒకళ్ళకు, ఒకళ్ళు అనుకుని, లోకాన్ని మరచి ఏదో మైమరుపులో వున్న నవదంపతులు, ఇతని నవ్వు విని దూరం దూరంగా జరిగారు.

మెత్తటి భుజాల నునుపునీ, మెరుపునీ, అందమైన వీపు తెల్లదనాన్నీ దాచలేక పోతూంది - ఆమె తొడుకున్న నీలం రంగు స్లీవ్‌లెస్ బ్లవుజ్. ఉన్నదో లేదో అని అనుమానం వస్తుందని కాబోలు, వంపులు తిరిగిన నడుముని, అనుమాన నివృత్తి కోసం, కనపడేటట్లుగా చీర కట్టిన ఆమె, మళ్ళీ అతనికి దగ్గరగా జరిగింది.

ఆమెను చూడగానే ఊహాలోకంలో విహరిస్తున్న గోపాలానికి సావిత్రీ, అరవిందా గుర్తుకు వచ్చారు.

సావిత్రిలో అదొక విధమైన ఆకర్షణ వుంది. అందం కన్నా ఆమెలో ఆకర్షణ ఎక్కువ వండటానికి కారణం, ఆమె మాట తీరూ, ఆ మాటలను అందంగా చెప్పే ఆ తీయటి, ఎర్రటి పెదవులూ --

"ఈ ఎయిర్ కూలర్ ఇంత చల్లదనాన్ని ఇస్తున్నా, నీ సన్నిధిలో ఎందుకో వెచ్చగా వుంటుంది" అనేది తన నీలి కళ్లలో మరింత సోయగాన్ని నింపుతూ.

"ఈ ఫోమ్ పరుపుల మెత్తదనం, నీ హృదయం ముందు ఎందుకూ పనికి రాదు!" అనేది తన హృదయం మీద వాలి, తన్మయత్వంతో కళ్ళు మూసుకుని.

తను నవ్వేవాడు.

"నవ్వకు - అలా నవ్వితే నీ హృదయ స్పందన ఎక్కువయి, నా ఆనందాన్ని డిస్టర్బ్ చేస్తుంది!" అనేది!

అంటూనే తన నవ్వుని, ఆమె పెదవులతో ఆపేసేది.

పెళ్ళయిన తర్వాత ఎక్కడ వుందో, ఎలా వుందో సావిత్రి!

సావిత్రిలో వున్నది ఆకర్షణ అయితే, అరవిందలో వున్నది అసలయిన అందం. అందమైన అందం ఆమెది. సన్నగా సన్నజాజి తీవలా వుంటుంది. మల్లె మొగ్గలోని మధురమైన గుబాళింపు వున్నది ఆమెలో - హరివిల్లులా వంపు తిరిగిన ఆమె ముక్కు లోనే ఆ అందం వున్నదో, ఆమె లేత గులాబీ రంగు బుగ్గలలోని లావణ్యంలోనే ఆ అందం వున్నదో చెప్పటం చాల కష్టం.

తనని వదిలి ఒక క్షణం వుండగలిగేది కాదు. ఆమెనీ, ఆమె లక్షల ఆస్తినీ స్వంతం చేసుకోమనేది.

తను మృదువుగా నవ్వేవాడు.

"నాకున్న లక్షల ఆస్తీ నాకు చాలు. కాని అమూల్యమైన నిన్నూ. నీ అందాన్ని మాత్రం

జన్మజన్మాలకూ కోరుకుంటాను!" అనేవాడు.

అరవింద మత్తుగా నవ్వేది. ఆ మత్తులోనే తన సర్వస్వం దాసోహం చేసింది. తను ఆమెను పెళ్ళాడలేనని చెప్పినప్పుడు ఒక క్షణం అదోలా చూసింది. మరో క్షణంలో గలగలా నవ్వింది.

"ఓ.కే - నువ్వు సుఖంగా వుంటే నాకదే చాలు!" అన్నది. తన చేతికి మృదువుగా ముద్దు పెట్టుకుని, కనుమరుగయింది.

సావిత్రిలోని ఆకర్షణా, అరవిందలోని అందం, రెండూ పూర్తిగా వున్నాయి మాలతిలో. అందుకే ఆమెతో అసలు పరిచయం లేకపోయినా వెంటనే అంగీకరించాడు మాలతిని పెళ్ళిచేసుకోటానికి. మాలతి తన అందం కన్నా, ఆకర్షణ కన్నా మించిన ఆస్థితో తన స్వంతమయింది.

"మీకు అందరిలా వుద్యోగాలు చేసే అవసరంలేదు గనుక, ఎప్పుడూ నా ముందే కూర్చుని, నా కళ్ళల్లోకే చూస్తూ వుండండి!"

ఆమె చెప్పింది నిజమే కనుకా, అందులో తనకీ ఒక విధమైన ఆనందం కనపడింది కనుకా అదే పని చేసేవాడు. జీవితంలోని మాధుర్యాన్ని తమకంటే ఎక్కువగా, ఎవరూ చవిచూడలేదేమో.

ఫ్రిజ్‌లోనించి అప్పుడే తీసిన వెన్న ముద్ద లాటిది మాలతి మనసు.

మెత్తగా జారిపోయే ఇంపోర్టెడ్ కారు లోని సౌఖ్యం వున్నది ఆమె వడిలో.

ఫారిన్ లిక్కర్స్‌లో వున్న 'కిక్' వున్నది ఆమె నడకలో, హొయలులో--

ప్రక్కన కూర్చున్న నవదంపతులు మెల్లగా లేచారు. ఆమె అతని చేయి పట్టుకుని తన తలని అతని భుజానికి ఆనించి నెమ్మదిగా నడుస్తున్నది.

ఒక బిచ్చగాడు వాళ్ళ వెంటపడి డబ్బులు అడుగుతున్నాడు.

గోపాలానికి కోపం వచ్చింది. అసలు భారతదేశంలోని పేదవాళ్లందరినీ కాల్చేయాలి. బిచ్చగాళ్ళందర్నీ నరికేయాలి. అప్పుడే దేశం బాగుపడుతుంది. సోషలిజం వచ్చేస్తుంది. అప్పుడు 'గరిబీ హటావో' లాటి నినాదాలతో పనిలేదు.

ఆ జంట మెల్లగా వెళ్ళి కారులో కూర్చున్నారు. ఆమె డ్రయివ్ చేస్తున్నది. అతను ఆమెను ఆనుకుని కూర్చున్నాడు.

మాలతికి ఇండియాలో చేసిన కార్లంటే మహా చిరాకు. ఎప్పుడూ ఇంపోర్టెడ్ స్టఫ్ మాత్రమే కావాలంటుంది. అందులోనూ రెండు కార్లను కొనిపించింది. పార్టీలకు పెద్దకారు, షికార్లకు చిన్న కారు. లేడీస్ క్లబ్ సెక్రటరీ కనుక ఆ మాత్రం హోదా అవసరం అంటుంది. మినిష్టర్ గారి భార్య మిసెస్ సన్యాసమ్మా, జనరల్ మేనేజర్‌గారి భార్య మిసెస్ పార్వతీశం తనచుట్టూ తిరుగుతుంటే మాలతికి సరదా.

"వీళ్ళంతా నా శాటిలైట్లు" అనేది.

"మన దేశంలో దరిద్రులు ఎక్కువ. పూర్ కంట్రీ, పూర్ పీపుల్. వీరందరూ చావాలంటే

ఒక్కటే మార్గం'' అనేవాడు తను.

డైటింగ్ చేస్తున్న మాలతి అడిగేది 'ఏమిటి' అని.

''పార్టీలలో, నైట్ క్లబ్బులలో, హోటళ్ళలో తిండి అంతా వృధాగా పారేయాలి. ఒక్క మెతుకు కూడా సామాన్య మానవుడికి అందకూడదు. దేశంలో వున్న తిండి గింజలు అన్నీ వండేసి, ధనవంతులు తిన్నంత తిని, మిగతాది మన పవిత్ర నదులయిన గంగా, కావేరీ, కృష్ణా, గోదావరీలలో పారేయాలి. అప్పుడు జనం తిండి లేక ఆకలితో చస్తారు''.

మాలతి పకపకా నవ్వి, ''అప్పుడు సోషలిజం వచ్చేస్తుంది కదూ!'' అనేది.

ఆమె పెదవుల మధ్య నుంచీ వచ్చే 'తీయటి' ఆ మాటలను తను ఆ పెదవుల మీదే మింగేశేవాడు.

''మనకి ఇద్దరు పిల్లలు చాలు!'' అనేది మాలతి.

''అదేం! పాతిక మందిని కన్నా, ఒక్కొక్కడికీ ఒక లక్ష రూపాయలు ఆస్థి యివ్వవచ్చు కదా!'' అనేవాడు తను.

'మనకేం ఖర్మ, ఇద్దరు పిల్లలతో సరిపెట్టుకోటానికి మనకేం డబ్బులేదా!' అన్న భావం ఆమెకి తెలిసిపోయేది తన జవాబులో.

మాలతి గలగలా నవ్వేది.

''అందుకు కాదు, నా అందం, శరీరం పాడయిపోవూ?'' అనేది.

''అవును నిజం!'' అనేవాడు ఆమె వడిలో వెచ్చగా తల దాచుకుని, ఆమెవేపు తీయగా చూస్తూ.

నాలుగు అంతస్థుల హోటలు గావును లైట్లతో మెరిసిపోతూ నౌబత్ పహాడ్ మీద నుంచి చూస్తుంటే, నగ్నంగా నిలబడ్డ అప్సరసలా కనపడింది గోపాలానికి.

వాన వచ్చేట్టుగా వుంది. పెద్దగా గాలి వీచింది.

ట్యాంక్‌బండ్ మీద వరుసగా మెరుస్తున్న లైట్లు, మాలతి మెడలోని ముత్యాల హారంలా వుంది.

ఆకాశం పెళ్ళుమని ఉరిమింది.

ఉలిక్కిపడ్డాడు గోపాలం.

మళ్ళీ పెద్దగా వురిమింది ఆకాశం.

గోపాలం ఆలోచనలు విశాలాకాశంలో డిసాల్వ్ అయిపోయాయి.

అతను లేచేంతలో వాన చినుకులు పడటం ప్రారంభించాయి.

చటుక్కున పైకి లేచి చుట్టూ చూశాడు. తను కొండ మీద అందరికన్నా ఎత్తులో వున్నాడు. అంటే ఆకాశంలో ఉన్నాడు. యిప్పుడు వాన వస్తున్నది. తలదాచుకోవాలి. అంటే భూమి మీదకు దిగాలి. తను ఆకాశం మీద నుంచి భూమి మీదకు రావాలి. ఊహాలోకం నుంచి వాస్తవ ప్రపంచంలో అడుగు పెట్టాలి. ఆకలితో మాడుతున్న పొట్టలో ఏదన్నా పడేయాలి.

తాత్కాలికమయినా, సుఖంగా వున్న ఊహా లోకపు ఆనందంలోనుంచి, నిజ జీవితంలోని బాధల్ని అనుభవించటానికి బయల్దేరాలి. ఇది జీవితం. అనుభవించక తప్పదు.

తనలాటివాడు, తాత్కాలిక ఆనందం కోసం, ఊహాలోకపు కొండలు ఎక్కినా, వాన రూపంలో వచ్చే ఆకలీ, వాస్తవికతా, భూమి మీదకు బలంగా లాగుతాయి. గ్రావిటేషనల్ ఫోర్సు అంటే యిదేగావును!

వాన పెద్దదయింది.

గోపాలానికి ఆకలి యింకా, యింకా పెరిగిపోతున్నది. చెప్పులు లేని కాళ్ళతో చకచకా నౌబత్ పహాడ్ మీద నుంచి క్రిందకు దిగుతున్నాడు.

పెరిగిన అతని గడ్డం, యిందాక అతను పడుకున్న లాన్ కన్నా ఎక్కువ దుబ్బుగా వుంది.

లోతుకుపోయిన అతని కళ్ళు, యిందాక అతను చూసిన అమ్మాయి శరీరపు వంపుల కన్నా లోతుగా వున్నాయి.

తను కాలేజీలో వుండగా మొదటి నించీ, తననీ, తన దరిద్రాన్నీ చూసి అసహ్యించుకుని. అతని కోర్కెల్ని ఊహారూపంలోనే వుంచి, పారిపోయిన సావిత్రిలా పరుగెత్తు తున్నాడు యిందాకటి బిచ్చగాడు.

"నువ్వు ప్రపంచంలో వూపిరి పీల్చటానికి అనర్హుడివి!" అని ముఖం మీదే అనేసి, తన వునికినే అపహాస్యం చేసిన అరవింద నవ్వులా ఆకాశం వురుముతున్నది.

గబగబా దిగుతున్నాడు గోపాలం ఆకాశం మీదనుంచి క్రిందకు, ఊహాలోకం నుంచి వాస్తవిక లోకంలోకి--

వానలో తడుస్తూ పరుగెత్తుతున్న, డొక్కలు ఎండిపోయిన కుక్కను చూడగానే తన భార్య మాలతి గుర్తువచ్చింది. ఉద్యోగం రానీయమని మొత్తుకున్నా వినకుండా, రోగిష్టి మాలతితో తనకు పెళ్ళి చేశారు. మాలతి తెచ్చిన కట్నంతో తన చెల్లెలుకు మొగుడు దొరికాడు. కానీ, తనకి మాత్రం నాలుగేళ్ళలో నలుగురు పిల్లలు తయారయారు. ఉద్యోగం మాత్రం రాలేదు.

వాన పెద్దదయింది. గోపాలం గబగబా భూమి మీదకు వచ్చేస్తున్నాడు. తన యింట్లో కూడా కురుస్తూ వుంటుంది వాన - గమ్మత్తేమిటంటే బయట వాన తగ్గినా, తన యింట్లో మాత్రం తగ్గదు. ఆ పూరి కొంప వానాకాలం వెళ్ళిన నెల రోజుల దాకా వర్షిస్తూనే వుంటుంది.

అతను పూర్తిగా భూమి మీదకు దిగాడు. ఎదురుగా చూశాడు. హోటల్ కనపడింది. వాళ్ళు వృధాచేసేంత అన్నం చాలు తన కుటుంబంలో అందరి కడుపులూ నిండటానికి -- ఊపిరి నిలుపుకోటానికి.

గోపాలం నిట్టూర్చాడు--

కానీ ఆకాశం వేపు మాత్రం చూడలేదు -- అతనికి ఎందుకో భయమేసింది.

భూమి మీద నిటారుగా నుంచుని, ఆకలి బాధకు తాళలేక, "అమ్మా!" అని బావురు మన్నాడు. ✿